# మహిళ మెడలో బంగారు గొలుసు దోపిడీ

కేవీబీ పురం, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:
పట్టపగలే సినీ ఫక్కీలో మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగులు దోచుకెళ్లిన సంఘటన మండలంలోని ఆరే గ్రామ సమీపంలోని బంగారమ్మ ఆలయం వద్ద చోటు చేసుకుంది. కేవీబీ పురం ఎస్ఐ వీరాంజనేయులు కథనం మేరకు... మండలంలోని ఆరే గ్రామానికి చెందిన జగదీశ్వర్‌రెడ్డి భార్య టి.సావిత్రి వ్యవసాయ పనుల నిమిత్తం బంగారమ్మ ఆలయ సమీపంలోని తన సొంత పొలం వద్దకు వెళుతుండగా ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు ఆమె వద్ద ఆగి మెడలోని బంగారు గొలుసు వేసుకుని జనసంచారం లేని వద్ద తిరిగితే దొంగలు దోచుకెళ్తారని ఆమెను మభ్యపెట్టి పోలీసులమంటూ మెడలోని బంగారు గొలుసును తీసేయాలన్నారు. ఆమె వినుక పోవడంతో ఆమెపై దాడి చేసి గుర్తు తెలియని దుండగులు సావిత్రి మెడ నుంచి బంగారు గొలుసును తీసుకుని బైక్‌పై పరారయ్యారు. దీంతో ఆందోళనకు గురైన సావిత్రి భర్త కుమారుల సహాయంతో స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. అపహరణకు గురైన బంగారు గొలుసు నాలుగు సవర్లు ఉంటుందని బాధితురాలు తెలిపారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.


# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త




# ఏనుగుల దాడులతో పంట నష్టం

సదుం, సెప్టెంబరు 21 ప్రబాతవార్త



మండల పరిధిలోని పలు పల్లెల్లోని రైతుల పొలాల వద్ద ఏనుగులు దాడులు చేసి నష్టపరిచాయి. గ్రామస్థులు తెలిపినమేరకు చెరకువారిపల్లె, జోగివారిపల్లె పంచాయతీల పరిధిలో రెండు ఏనుగుల గుంపులు తిష్ట వేసి ఉన్నాయి. ఇవి రాత్రి పూట పంటలపై పడి ధ్వంసం చేస్తున్నాయి. శుక్రవారం రాత్రి మార్తువారిపల్లెలో ఏనుగుల గుంపుదాడి చేసి జనార్ధన్‌రెడ్డి, చంద్రమ్మ, కృష్ణమ్మ, రెడ్డెప్పరెడ్డిలకు చెందిన వరి, చెరకుపంటలను ధ్వంసం చేశాయి. అదేవిధంగా మరో రైతుకు చెందిన డ్రిప్ పైపులను, మామిడి తోటకు వేసిన రాతి కూసాల కంచెను తొక్కి వేశాయి. విరిచి వేశాయి. దానితోపాటు నల్లరాళ్లపల్లెకు చెందిన బండి రాఘవకు చెందిన క్యాబేజీ, వరి పంటలలో నడచుకుంటు వెళ్లి తొక్కి దెబ్బతీశాయి. ఇక్కడ ఒక్క బీటీ ఆఫీసర్ మాత్రమే ఉన్నాడు. రెండు బీట్ల నుంచి ఏనుగులు వస్తున్నాయి. దీనితో ఆయనతోపాటు ఉన్న ట్రాకర్లు వాటిని అడ్డు కోలేక పోతున్నారు.

## వైభవోపేతం...
# గణనాధుని పుష్పపల్లకిసేవ
### -పోటెత్తిన భక్తజనం



కాణిపాకం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల ప్రత్యేక ఉత్సవాలలో భాగంగా శనివారం పుష్పపల్లకిసేవను అంగరంగ వైభవోపేతంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి శ్రీమతి.కె. బాగ్యలక్ష్మమ్మ, చిగరపల్లె, ఎన్. దామోదర్‌నాయుడు మరియు కుటుంబ సభ్యులు కాకర్లవారిపల్లె , కె.మోహన్‌నాయుడు అండ్ బ్రదర్స్, చిత్తూరు, కీ॥శే॥ఆర్. శేషాద్రినాయుడు అండ్ బ్రదర్స్, వి.టి.రాజన్ బ్రదర్స్, తిరువణంపల్లె, కీ.శే.వి.టి రాజన్ బ్రదర్స్,తిరువణంపల్లె, ఎం.రామనాథనాయుడు, తిరువణంపల్లె, జి.కృష్ణమనాయుడు అండ్ సన్స్, అడపగుండ్లపల్లె, ఎ.నరసింహారెడ్డి అండ్ సన్స్,అగరంపల్లె, యం.రాజారెడ్డి అగరంపల్లె, యం.శ్రీరాములురెడ్డి అగరంపల్లె, యం.బాలకృష్ణారెడ్డి అండ్ కో చిత్తూరు, మొగిలీశ్వర ఏజన్సీస్ చిత్తూరు, జి.శేషయ్యానాయుడు అండ్ సన్స్ చిత్తూరు, రాధారాం బోర్‌వెల్స్ చిత్తూరు, బి. కుమరేం ద్ర చౌదరి,సి.ఎ.చిత్తూరు, యం.మనోహర్‌నాయుడు అండ్ బ్రదర్స్ అడపగుండ్లపల్లె, జి. ఆంజనేయులు నాయుడు అండ్ సన్స్ చింతగుంపల పల్లెలు ఉభయదారులుగా వ్యవహరించారు. రాత్రి సిద్ధి, బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలోవుంచి వేదపండితుల మంత్రో చ్చారణ నడుమ అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల దేశీయ, విదేశీ జాతి పుష్పాలు, రంగురంగుల విద్యుద్ధీపాలతో దేధీప్యమానంగా భారీ ఎత్తున ఏర్పాటు చేసిన ప్రత్యేక పుష్పపల్లకిపై స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అధిష్టింపజేసి మరోమారు ప్రత్యేకపూజలు నిర్వహిం చారు. అనంతరం కాణిపాకం పురవీధుల గుండా ఉభయ దేవేరులతో కలసి స్వామివారు ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. పుష్పపల్లకి సేవను తిలకించడానికి వచ్చిన అశేష భక్తజనంతో కాణిపాకం పోటెత్తింది. కార్యక్రమంలో ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్,ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు విఘ్నేష్, రవి, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ సుధీర్,ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మధుసూధన్‌రావులతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## వరసిద్దునికి వైభవంగా స్వర్ణ రథోత్సవం

కాణిపాకం వరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో శనివారం రాత్రి సిద్ది బుద్ది సమేతుడైన వరసిద్దుడు సర్వాలంకృతుడై స్వర్ణరథంపై అధిరోహించి ఆలయ మాడా వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి నెలా పౌర్ణమి అనంతరం సంకటహర చతుర్థి రోజున స్వామివారికి స్వర్ణరథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో సాయంత్రం 4 గంటలకు సంకటహర చతుర్థి వ్రతంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారికి స్వర్ణ రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా సిద్ది, బుద్ది సమేత గణనాధుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి సర్వాంగ సుందర ంగా అలంకరించి వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం మంగళవాయిద్యాల నడుమ మిరమిట్లు గొలుపుతున్న అలంకరించిన స్వర్ణరథంపై వుంచి మరోమారు అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల గణేష్ నామస్మరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ మాడా వీధుల్లో స్వామి, అమ్మవార్లను ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, ఏఈఓ విదా్యసాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌లు వాసు,కోదండపాణి, అర్చకులు,వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# 'కల్తీ'కి కారకులు ఎవరు!?

### ఈఓ రిపోర్టులో నిక్షిప్తమైన రహస్యం -భక్తుల మనోభావాలపై ప్రభావం





ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:
ఆపదమొక్కులవాడు...వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి పవిత్రంగా సమర్పించే లడ్డూల తయారీలో కల్తీనెయ్యి పాపానికి కారకులు ఎవరనేది ఇప్పుడు టిటిడి ఉద్యోగుల్లోనేగాక శ్రీవారి భక్తుల్లోనూ వినిపిస్తున్న హాట్‌టాపిక్. మహాపాపంగా దేవుని ప్రసాదాల తయారీకి అనాదికాలంనుండి వినియోగిస్తున్న ఆవునెయ్యిలో పందికొవ్వు, గొడ్డుకొవ్వునూనెలతోబాటు శాఖాహారపదార్థాలతో తయారుచేసిన నూనెలు కల్తీచేసి పంపిన కాంట్రాక్టర్లు, ఇక్కడ పరీక్షించి వెనక్కుపంపాల్సి న టిటిడి అధికారులు, ల్యాబ్, మార్కెటింగ్, విజిలెన్స్ ఉద్యోగులు పాపం పండినట్లేనా?అనేది ఇప్పుడు సంచలనంగా మారింది. కల్తీనెయ్యి దుమారంపై తాజాగా టిటిడి ఈఓ జె.శ్యామలరావు ప్రభుత్వానికి సమర్పించిన రిపోర్టులో నిక్షిప్తమైన రహస్యం ఏమిటనేది ముఖ్యమంత్రి ప్రకటనచేస్తేగానీ వెల్లడికాదు. ఈ నేపథ్యంలో కల్తీ దుమారంపై భక్తులు మనోభావాలపై గత టిటిడి అధికారులు దెబ్బకొట్టారనేది వ్యక్తమవుతోంది. సహజంగానే దేవుని ప్రసాదం..అందునా ఏడుకొండల వేంకటేశ్వరస్వామి లడ్డూప్రసాదం భక్తితో స్వీకరిస్తే తమ కష్టాలు తొలగిపోతాయనేది హిందు భక్తుల ప్రగాఢ నమ్మకం. లడ్డూప్రసాదంకోసం కల్తీనెయ్యి వాడారనేది ఇప్పుడు ప్రతి ఒక్కరూ స్పందిస్తున్నారు. శనివారం దేశవ్యాప్తంగా ఉన్న పలువురు స్వామీజీలు, మఠాధిపతులు స్పందించారు. దీనికి కారణమైన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తిరుమలకు వచ్చిన ప్రతి భక్తుడు ఎంతో విశ్వాసంతో దేవుని దర్శనం చేసుకుంటారని, తిరిగి వెళ్ళేటపుడు అంతే పవిత్రంగా స్వామివారి లడ్డూప్రసాదాలను తీసుకెళతారనేది భక్తుల నమ్మకం. అంతటి పవిత్రంగా లడ్డూలను కలుషితంచేసిన పాపం పై మరీ ఎవరికి శిక్ష పడనుందనేది మాత్రం అందరిలోనూ ఆసక్తికర చర్చగా మారింది. కల్తీనెయ్యి వస్తున్నా మార్కెటింగ్ విభాగం అధికారులుగానీ,తిరుమలలో పోటు అధికారులు, కార్మికులుగానీ చివరకు తిరుమలేశుని నైవేద్యప్రసాదాల తయారీని ముందుగానే పరీక్షించే ల్యాబ్ అధికారులుగానీ ఎందుకు గుర్తించలేకపోయారనేది ఇప్పుడు సందేహాలకు తావిస్తోంది. గతకొద్దికాలంగా కల్తీ నెయ్యితో లడ్డూప్రసాదాలు తయారీ జరిగినా ఎందుకు కనిపెట్టలేకపోయారనేది జవాబులేని ప్రశ్నలుగా మారాయి. అంతేగాక పోటులో పనిచేసే కార్మికులు కల్తీనెయ్యి వాసనను గుర్తించి ఉన్నతాధికారులకు ఎందుకు చేరవేయలేదనేది ఇప్పుడు అటు దేశవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తుల్లో ఇటు టిటిడి ఉద్యోగుల్లో వ్యక్తమవుతున్న సందేహాలు. ఇంత అపచారం, మహాపాపం జరిగినా, కొందరు ఒడిగట్టినా ఇప్పటివరకు టిటిడి అధికారులు పోలీసు కేసుల వరకు వెళ్ళకపోవడం మరో విశేషం. ఇప్పటికే నాణ్యమైన నెయ్యి కొనుగోలుకు సంబంధించి నలుగురు డైరీ నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసిన టిటిడి , ఎన్‌డిఆర్ఎ విశ్రాంత ఆచార్యులు డాక్టర్ సురేంద్రనాథ్, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, ఆచార్య స్వర్ణలత, బెంగుళూరుకు చెందిన డాక్టర్ మహదేవన్ ఉన్నారు. నెయ్యిరుచిని పొందడానికి వెన్నను 120డిగ్రీల సెంటిగ్రేడ్‌లో 2-5నిమిషాలు వేడిచేస్తే నాణ్యత తెలిసిపోతుందని చెబుతున్నా అందుకు తగ్గట్లు టిటిడిలో ఎందుకు చర్యలు తీసుకోలేదనేది మరింతగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టిటిడిలో కొనుగోళ్ళ కమిటీలో కీలకంగా ఉన్నతాధికారులు, బోర్డు సభ్యులు, ఎఫ్ఎసిఎఓ,జిఎం నియామకాలు అధికారులును విచారణ చేస్తారా?అనేది ఇప్పుడు హాట్‌టాపిక్. ఈఓ రిపోర్టులో కల్తీ నెయ్యి తప్పిదాలకు ఎవరు బాధ్యత వహిస్తారనేది వెల్లడికావలసిన విషయం. ఇప్పటికే తమిళనాడుకు చెందిన నెయ్యిసరఫరా చేసిన ఓ డైరీ యాజమాన్యం స్వయంగా పుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు చేశారని, ఎలాంటి కల్తీ లేదని తేల్చారని ఆ డైరీ యాజమాన్యం వెల్లడించింది. అంతేగాక నాణ్యత నిర్ధారణ పరీక్షల తరువాత టిటిడికి నెయ్యిసరఫరా చేశామని తెలిపింది. 25సంవత్సరాలుగా డైరీ సేవలందిస్తున్నామని, ఇలాంటి ఆరోపణలు రాలేదని స్పష్టం చేసింది. మరోవైపు మరోప్రముఖ డైరీ యాజమాన్యం కూడా ముందుగానే స్పందించి తామెలాంటి నెయ్యి సరఫరాచేయాలేదని వెల్లడించింది.

## 175 ఎఎస్ఐ, హెడ్‌కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళు బదిలీ

చిత్తూరు, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:



జిల్లా వ్యాప్తంగా 175 మంది ఎఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళను బదిలీ చేస్తూ ఎస్పీ మణికంఠ చందోలు ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీ మణికంఠ చందోలు శనివారం చిత్తూరు జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఐదేళ్ళు ఒకే స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళకు బదిలీ కౌన్సె లింగ్ నిర్వహించారు. ఈ కౌన్సె లింగ్ ప్రక్రియకు ప్రస్తుతం విఆర్‌లో వున్న 14 మంది ఎఎస్ఐలు, 59 మంది హెడ్ కానిస్టేబుళ్ళు, 102 మంది కానిస్టేబుళ్ళు హాజరై జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వర్తించడానికి పోస్టింగ్స్ కోరుకున్నారు. ఈ మేరకు ఎస్పీ మణికంఠ చందోలు వారికి కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ బదిలీ అయిన పోలీసులు విధుల్లో చేరి నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు కార్యాలయ ఎఓ మోహన్‌రావు, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది, ఐటి కోర్ టీమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### సత్యవేడు ఇన్‌చార్జి నియామకంపై
# అధిష్టానం కసరత్తు!

సత్యవేడు, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:
సత్యవేడు నియోజకవర్గానికి ప్రత్యేక ఇన్‌చార్జిని నియమించే విషయంపై టీడీపీ అధిష్టానం పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా వంద రోజుల సంబరాలుగా చేసుకునే ఇదిమంచి ప్రభుత్వం కార్యక్రమం విజయవంతం చేసే దిశగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు తీసుకోనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎమ్మెల్యే ఆదిమూలంపై మహిళా లైంగిక వేధింపు దాడి కేసు నమోదైన విషయం తెలిసిందే. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోతే నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి ఆందోళనకారంగా మారే అవకాశం లేకపోలేదని, అందు వల్లే ఇన్‌చార్జి నియామకంపై అధిష్టానం చర్యలు తీసుకుంటుందని సీనియర్ నాయకులు చెబుతున్నారు. దాంతో పాటు ఇద్దరు కలెక్టర్ స్థాయి అధికారులను నియమించి పారదర్శక పాలన, పేదలకు న్యాయం చేసే దిశగా అడుగులు వేయడానికి కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్యలు తీసుకుంటారని ప్రచారం సాగుతోంది. అటు కుప్పం, ఇటు సత్యవేడును తన రెండు కళ్ళ లాగా చూసుకుంటూ ముందుకెళ్ళడానికి అవసరమైన చర్యలు తీసుకుంటారనే అభిప్రాయాలు సీనియర్ నాయకుల నుంచి వ్యక్తం చేస్తున్నారు.


## కేసు కొట్టేయండి సార్లూ..
### ఎమ్మెల్యే ఆదిమూలంపై కేసులో హైకోర్టుకు బాధిత మహిళ వెల్లడి
### దేవునితోనే రాజకీయం చేసే ఘనుడు చంద్రబాబు - రోజా
వార్తలు మెయిన్‌లో


# అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త



అభివృద్ధి, సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయమని, రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలన్నదే ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ఉద్దేశ్యమని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం ఆటో నగర్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ప్రజా వేదికను తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్, మున్సిపల్ కమిషనర్ మౌర్య, సంబం ధిత అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అభివృద్ధి సంక్షేమం ఒకే పద్ధతిలో ముందుకు తీసుకెళ్ళాలని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లోని అభివృద్ధిపై మరింత దృష్టి సారించినట్లు ఆయన చెప్పారు. ప్రజల వద్దకే ప్రజా ప్రతినిధులు, అధికారులు వచ్చి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే ప్రజా వేదిక లక్ష్యమని తెలిపారు. వందరోజుల్లో ప్రభుత్వం ఏమి చేసింది, వార్డు సచివాలయ సిబ్బంది ప్రజలకు వివరించి వారి సమస్యలను కనుక్కొని పరిష్కరించే దిశగా కృషి చేయాలని తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు తొలిసంతకంగా ముఖ్యమంత్రి మెగా డీఎస్సీపై చేశారని ఆయన తెలిపారు. అలాగే శెట్టిపల్లి భూ సమస్యను త్వరగా పరిష్కరించాలని ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చెప్పారని అలాగే 2019లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ సమస్య పరిష్కరించాలని చర్యలు తీసుకున్నారని ఆయన వివరించారు. అలాగే దేవి అనే మహిళ తన పాపకు చిన్నప్పటి నుంచి ఆరోగ్యం సరిగా లేదని చెప్పగా కలెక్టర్ వెంకటేశ్వర్ స్పందిస్తూ పరిష్కరిస్తానని తెలిపారు. నగర పరిశుభ్రతకు ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు. అనంతరం ఇంటింటికి వెళ్లి వంద రోజుల్లో ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించడంతో పాటు స్టిక్కర్స్‌ను ఎమ్మెల్యే అంటించారని తెలిపారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ఇది మంచి ప్రభుత్వం అని వంద రోజుల్లో పాలనలో ప్రభుత్వం ఏమేమి చేసింది అని ప్రజా వేదికగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో అనేక కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మెప్మా పిడి రాధమ్మ, డిఈ విజయకుమార్ రెడ్డి, కృష్ణ వేణి, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి సస్పెన్షన్
## ఇన్‌చార్జి ఆర్డీఓగా రవిశంకర్‌రెడ్డి

తిరుపతిరూరల్, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:
తిరుపతి ఆర్డీఓ నిషాంత్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇన్‌చార్జి ఆర్డీఓగా శ్రీకాళహస్తి ఆర్డీఓ రవిశంకర్‌రెడ్డిని నియమించారు. పుత్తూరులో పెట్రోల్ బంక్ నిర్వాహణకు నిరభ్యంతర పత్రాని జారీ చేయడానికి లక్ష రుపాయాలు డిమాండ్ చేసిన ఘటనలో తిరుపతి ఆర్డీఓ నిషాంత్‌రెడ్డిను సస్పెండ్ చేస్తూ రెవిన్యూ ప్రత్యేక ప్రధాన కార్యధర్శి సిసోదియా ఆదేశాలు జారీ చేసారు. ఆర్డీఓతో పాటు గతంలో పుత్తూరు తహశీల్ధార్‌గా పనిచేసి అనంతపురం జిల్లా, ఆత్మకూరుకు బదిలీపై వెళ్ళిన తహశీల్ధార్ పరమేశ్వర్‌ను, తిరుపతి కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్ సురేష్‌కుమార్‌లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసారు. పెట్రోల్ బంక్ యజమాని శ్రీను ఫిర్యాదు మేరకు విచారణ చేసిన ప్రభుత్వం లంచం డిమాండ్ చేసారనే నిర్ధారణ ఆరోఫణలపై నిషాంత్‌రెడ్డిని సస్పెండ్ చేసారు.

### తిరుపతి ఇన్‌చార్జి ఆర్డీఓగా రవిశంకర్‌రెడ్డి



తిరుపతి ఇన్‌చార్జి ఆర్డీఓగా శ్రీకాళహస్తి ఆర్డీఓ ఎన్. రవిశంకర్‌రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పజెప్పుతూ జిల్లా కలెక్టర్ డాక్టర్ వేంకటేశ్వర్ ఉత్తర్వులు జారీ చేసారు. తిరుపతి ఆర్డీఓగా ఉన్న నిషాంత్‌రెడ్డిపై అవినీతి ఆరోఫణలపై ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయం తెల్సిందే. తిరుపతి ఆర్డీఓ పోస్టు తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఇన్‌చార్జి ఆర్డీఓగా రవిశంకర్‌రెడ్డి కొనసాగనున్నారు.

### దరకాస్తులో అటవీ భూములు
# అన్యాక్రాంతం
### - చోద్యం చూస్తున్న అధికారులు





చిట్టమూరు, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త
చిట్టమూరు మండలం దరకాస్తు గ్రామంలో ఉన్న అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. చిల్లమూరు, దరకాస్తు గ్రామాలకు మధ్యలో అటవీ అధికారులు ట్రెంచి ఏర్పాటు చేసిన పక్కనే ఉన్న అటవీ భూములను ఆక్రమించిన కొందరు సాగుకు సన్నద్ధం అవుతున్నారు. అటవీ భూములను ఆక్రమించి సాగులోకి తెచ్చుకునేందుకు మరికొందరు ఒకరిని చూసి మరొకరు తమ తమ ప్రయత్నాలు మొదలుపెట్టారు. అక్రమార్కులకు అటవీ శాఖలో పనిచేసే క్రిందిస్థాయి సిబ్బంది ఒకరు సహాయ సహకారాలు అందిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మొలకలపూడి గ్రామంలో వందలాది ఎకరాల అటవీ భూముల అన్యాక్రాంతాన్ని అడ్డుకున్న అధికారులు దరకాస్తు గ్రామంలో అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### అక్రమార్కుల భరతం పడతా - ఎఫ్‌బిఓ హర్షత్

దరకాస్తు గ్రామంలో ఆక్రమణకు గురవుతున్న అటవీ భూముల విషయాన్ని డిఆర్ఓ కోటేశ్వరరావు ద్వారా సమాచారం అందుకున్న చిట్టమూరు మండల బీట్ ఆఫీసర్ హర్షత్ త్వరితగతిన స్పందించారు. విషయం తెలిసిన వెంటనే దరకాస్తు గ్రామంలో ఆక్రమణకు గురైన భూమిని పరిశీలించి అక్రమార్కులకు హుకుం జారీ చేశారు. అటవీ భూములు ఆక్రమించిన చల్లా వెంకటేశ్వర్లు ఇంటికి వెళ్లి ఇకపై అటవీ భూముల్లోకి చొరబడితే పోలీసు కేసులతో పాటు కఠినమైన శిక్షలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించి మరీ వచ్చారు.

# తిరుమల అపవిత్రకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలి

### -ఎమ్మెల్యేలు శ్రీనివాసులు, పులివర్తి నాని, గురుజాల జగన్మోహన్, మురళి



తిరుపతిరూరల్, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:
శ్రీవారి లడ్డు తయారీలో కల్తీ నెయ్యి వాడకంపై సమగ్ర దర్యాప్తు చేసి, అక్రమాలకు పాల్పడినవారిని కఠినం శిక్షించుటకు ప్రభుత్వ చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, మురళి, గురుజాల జగన్మోహన్‌లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువుల మనోభావాలు దెబ్బతినేలా గత ప్రభుత్వ పాలకులు వ్యవహరించారని, భక్తులు అత్యంత భక్తితో ప్రీతికరంగా భావించి స్వీకరించే శ్రీవారి లడ్డు ప్రసాదం తయారీలో జంతువుల కొవ్వు, కెమికల్స్ వాడారని, ఇంతదారుణానికి ఒడికట్టిన గత టిటిడి ఇవో ధర్మారెడ్డి, టిటిడి ఛైర్మెన్‌లుగా వ్యవహరించిన వైవి సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి చర్యలు తీసుకోవాలన్నారు. శ్రీవారి లడ్డు తయారీలో నాణ్యమైన గొవు నెయ్యిని మాత్రమే వాడతారని తెలిపారు. నాణ్యమైన నెయ్యి కర్ణాటక, పంజాబ్, డిల్లీలో ఉన్న డైరీలలోనే లభిస్తుందని తెలిపారు. లడ్డు తయారీలో నాణ్యమైన నెయ్యి కాకుండా కేవలం కిలో రూ.321 రుపాయాలకు కొనుగోలు చేసి వినియోగించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీవారి లడ్డులో నాణ్యత లోపించిందని, కల్తీ నెయ్యి వాడారని ఆరోపిస్తే, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎదురుదాడి చేస్తూ చంద్రబాబునాయుడు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాడని ఆరోపించడం బాధాకరం అన్నారు. కల్తీ నెయ్యి వినియోగంపై ల్యాబ్ రిపోర్టు కూడా వచ్చిందని, కల్తీ నెయ్యి వినియోగించారని రిపోర్టులు ఉన్నాయని తెలిపారు. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి సతీసమ్మేతంగా శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించాల్సి ఉండగా, గత ముఖ్యమంత్రి ఒక్కడే వచ్చి శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన విషయాన్ని గుర్తు చేసారు. టిటిడిని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి, ఆలయంలో సంప్రోక్షణ చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు సి.ఆర్.రాజన్, సీనియర్ నేత నరసింహ యాదవ్, శ్రీధర్ వర్మ పాల్గొన్నారు.

# కాణిపాకంలో ఆకట్టుకున్న ప్రత్యేకాలంకరణ





కాణిపాకం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:
కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం జరిగిన పుష్పపల్లకిసేవ సందర్భంగా ఆలయంలో చేపట్టిన విశేషాలంకరణ భక్తులను ఎంతో ఆకట్టుకుంది. పుష్పపల్లకిసేవ సందర్భంగా ప్రధాన ఆలయాన్ని వివిధ రకాల స్వదేశీ, విదేశీజాతి పుష్పాలతో శోభాయ మానంగా చక్కగా అలంకరి ంచారు. ఈసందర్భంగా నూతన ప్రధాన ఆలయం, బంగారు ద్వజస్థంభం, గర్భాలయం, అంత్రాలయం, అర్ధమండపం, ఆన్వేటి మండపం, సుపథమండపం, అలంకార మండపంలను వివిధ రకాల పుష్పాలు, మామిడితోరణాలు, అరటిచెట్లుతో సర్వాంగసుందరంగా అలంకరించారు. ముఖ్యంగా బంగారుధ్వజ స్థంభంకు చేసిన ప్రత్యేకాలంకరణ మరింత ఆకర్షణగా నిలిచింది. అలాగే ప్రధాన ఆలయంలోని అంత్రాలయం, అర్ధమండపంలను పలు రకాల పత్రాలు, పుష్పాలతో అద్భుతంగా అలంకరించారు.

## వైభవంగా సంకటహర గణపతివ్రతం

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో శనివారం సంకటహర గణపతివ్రతంను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ప్రధాన ఆలయం నుండి అలంకరించిన సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ స్థానిక అలంకార మండపంకు తీసుకువచ్చి వుంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నందున ఆస్థాన మండలంలో నిర్వహించే ఈవ్రతాని ్న ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో నిర్వహించారు. అలాగే ఉదయం 11 గంటలకు నిర్వహించే వ్రతాన్ని రద్దు చేసి సాయంత్రం 5 గంటలకు రెండు వందల టిక్కెట్లు మాత్రం విక్రయించి ఈవ్రతాన్ని నిర్వహించారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం తరపున తీర్థప్రసాదములను అందజేశారు. పవిత్రమైన సంకటహర చతుర్థి వ్రతం నిర్వహించుకోవడానికి వివిధ ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలిరావడం 200 టిక్కెట్‌లు మాత్రమే ఇవ్వడంతో భక్తులు నిరాశపడ్డారు. ఆలయ అధికారులు, సిబ్బంది భక్తులకు కావలసిన ఏర్పాట్లు చేపట్టారు. ఈకార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌లు వాసు,కోదండపాణి,టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవి,విఘ్నేష్, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో తిరువళ్ శనివార పూజలు



చౌడేపల్లి, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త
మండలంలోని పలు గ్రామాల్లో తిరువళ్ శనివార పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మేకలచిన్నేపల్లి, పందిళ్ళపల్లి, బాల సముద్రం, ఎర్రగంగనపల్లి, చుక్కావారిపల్లి, శెట్టిపేట, రాజులూరు, యర్రపల్లి, తోటకురపల్లి తదితర గ్రామాల్లోని ప్రజలు కలియుగదైవం వెంకటేశ్వరస్వామిని ఇళ్ళల్లో కొలవుంచి విశేష పూజలు చేసారు. ఆయాగ్రామాల్లో గోవింద నామాలతో మార్మోగాయి.

## గిరిజాపురానికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రాక

చౌడేపల్లి, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త



మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాటిపేరి పంచాయతీ గిరిజాపురంలో శనివారం పర్యటించారు. గ్రామంలోని వైకాపా నాయకుడు రాజారెడ్డి మృతి చెందడంతో అతని కుటుంబాన్ని పరామర్శించారు. వైకాపా కుటుంబంలో ఓ మంచి వ్యక్తిని కోల్పోయామనీ, మృతుని కుటుంబానికి అండగా వుంటామని హామీ ఇచ్చారు. చిత్తూరు మాజీ ఎంపి ఎన్.రెడ్డెప్ప, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, రాష్ట్ర దృశ్య కళలు అకాడమీ మాజీ సభ్యుడు కూరపర్తి అంజిబాబు, మండల ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, నరసింహులుయాదవ్, ఆసుపత్రి కమటీ మాజీ ఛేర్మన్ కళ్యాణ్‌భరత్, బోయ కొండ మాజీ ఛేర్మన్ మిద్దింటి శంకరనారాయణ, సభ్యుడు పవన్‌రాయల్, వైకాపా జిల్లా సేవాదళ్ కార్య దర్శి హరీష్ రాయల్, రంగన్న, చంద్ర, భాస్కర్, తొండాశ్రీరాములు, వైకాపానాయకులు పాల్గొన్నారు.

## నాటుసారా స్థావరాలపై ఆంధ్ర,తమిళనాడు పోలీసుల దాడులు

కుప్పంరూరల్, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త
కుప్పం మండలం ఆంధ్ర - తమిళనాడు సరిహద్దు ప్రాంతంలోని మోట్లచేను అటవీ ప్రాంతంలో కుప్పం అర్బన్ సిఐ జిటి నాయుడు, తమిళనాడు పోలీసులు నాటుసారా స్థావరాలపై ఉమ్మడి దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ ప్రాంతంలో ఉన్న నాటుసారా ఊటలను, బట్టీలను, సారాను ధ్వంసం చేశారు. ఈసందర్భంగా సిఐ జిటి నాయుడు మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లో ఎవరైనా నాటుసారా తయారీకి పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. నాటుసారా రవాణాపై ప్రత్యేక నిఘా సారించామన్నారు. కార్యక్రమంలో ఇరు రాష్ట్రాల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమానికి టిడిపి కట్టుబడి వుంది
### గంజి మాధవయ్య



పుత్తూరు, సెప్టెంబరు 20 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగుతోందని మాజీ ఎంపిపి, టిడిపి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య అన్నారు. శనివారం తడుకు పంచాయతీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల్లో పెన్షన్ పెంపు విజయవంతంగా అమలవుతోందని, దీపావళి పండుగ నుంచి ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లు పథకం ప్రారంభమవుతుందన్నారు. గత వైసిపి ప్రభుత్వ ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దుతో ప్రజల్లో టిడిపిపై మరింత నమ్మకం పెరిగిందని తెలిపారు. కార్యక్రమంలో తడుకు సర్పంచ్ బొబ్బిలి వెంకటేష్ యాదవ్, టిడిపి నాయకులు ఆది మందడి, కోట గజపతి, రామ్మూర్తి, కిరణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

తిరుపతిరూరల్, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:




శ్రీవేంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో స్వభావ స్వచ్ఛత- సంస్కార స్వచ్ఛత కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు కళాశాల ఆవరణలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవి రమణ మాట్లాడుతూ ప్లాస్టిక్‌పై పోరాటం ప్లాంటేషన్ డ్రైవ్, స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడం జరుగుతుందని తెలిపారు. రోగాలు వ్యాప్తిని అరికట్టి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచుకోవచ్చుని సూచించారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ వి.శైలజ, డాక్టర్ పి.శాంతి, డాక్టర్ గణేష్‌కుమార్, డాక్టర్ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధే నా బాధ్యత : ఎమ్మెల్యే నాని



రామచంద్రాపురం,సెప్టెంబర్ 21ప్రభాతవార్త: ప్రజలు తనపై ఉంచిననమ్మకాన్ని వమ్ము చేయనని, చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధి తన బాధ్యత అని ఎంఎల్ఎ పులివర్తి నాని ఉద్ఘాటించారు. శనివారం మండలంలోని కొత్తవేపకుప్పం పంచాయతిలో ఇదిమంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎంపిపి పాఠశాలలో, అంగన్‌వాడీ టీచర్లు ఏర్పాటుచేసిన వారోత్సవాలలో ఆయన అధికారులతో కలసి పాల్గొన్నారు. కూనేపల్లిలో ఇంటింటికెళ్ళి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను అందించి స్టిక్కరలను అతికించారు. మండలాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. రాయల్‌చెరువు నుండి అనుప్పల్లి వరకు డబుల్‌రోడ్డుకు ప్రతిపాదనలు పంపుతామన్నారు. రాయలచెరువును పర్యాటకకేంద్రంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. చెరువు కట్టపై చేపల వ్యాపారులకు షెడ్లు ఏర్పాటుచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీనివాస్, తాశీల్దార్ వెంకటరమణ, సర్పంచ్ హిమాలల్‌రెడ్డి, మాజీ ఎంపిపిలు కేశవులునాయుడు, బిందుమాధవి, టిడిపి మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, నాయకులు చిన్నబాబు, జనార్ధన్‌చౌదరి ,కోరా హరిప్రసాద్, సురేంద్రనాయుడు ,మహేశ్‌నాయుడు ,నరసింహారెడ్డి, విజయకుమార్‌రాయల్ పాల్గొన్నారు.

## సంకట చతుర్థి హోమాలు: అభిషేకాలు



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 21 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజంజి వినాయక ఆలయం వద్ద శనివారం సంకట చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. శనివారం సంకట హర చతుర్థిని ఘనంగా నిర్వహించారు.ఆలయంలో సంప్రదాయాలు, సంస్కృతికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆలయంలోని మహిమాన్వితుడై అంజంజి వినాయక ఆలయం వద్ద పూజలు నిర్వహించారు.ఆలయార్చకులు, వేదపండితులు కలశ స్థాపన గావించారు. శాస్త్రోక్తంగా గణపతి హోమాన్ని నిర్వహించారు. స్వామి వారికి విశిష్ట అలంకారం నిర్వహించారు. ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, ఆలయ ఇన్స్‌పెక్టర్ నాగభూషణం, వేదపండితులు శ్రీవత్సవ, అర్చకులు అనిల్‌శర్మ, పరిచారకులు రాజేశ్ శర్మ,భక్తులు పాల్గొన్నారు.

## పేదల పక్షపాతి.. అభివృద్ధి ప్రదాత సిఎం చంద్రబాబు
### - తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం



కుప్పంరూరల్ /శాంతిపురం/రామకుప్పం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త
పేదల పక్షపాతి సిఎం చంద్రబాబునాయుడు అని కుప్పం తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని మంకలదొడ్డి, కంగుంది, దాసేగానూరు, దేవరాజపురం గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం సభలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సిఎంగా సంతకం చేసిన తొలిరోజే 16349 డిఎస్సీ పోస్టుల భర్తీకి సిఎం చంద్రబాబు తొలిసంతకం చేశారన్నారు. అలాగే పెన్షన్లను 4వేలకు పెంచి అందిస్తున్నారన్నారు. విజయవాడ వరదల సమయంలో ప్రజలకు అండగా నిలిచారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తున్న ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కార్యక్రమాల్లో ఎండిపిఒ సాయిలహరి, నేతలు రాజగోపాల్, రామచంద్ర, ఎవి రవి, సర్పంచులు ధనశేఖర్, స్థానిక నేతలు శ్రీనివాసులు, మురళి, అన్నాదొరై, మూర్తి, షరీఫ్, గణేష్, అధికారులు హేమలత, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే శాంతిపురం మండలంలో సొన్నేగానిపల్లి, దండికుప్పం, కొలమడుగు పంచాయతీల్లో జరిగిన కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి ఉదయ్‌కుమార్, మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు మాట్లాడుతూ సంక్షోభంలోను సంక్షేమం అందిస్తున్న ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కార్యక్రంలో నేతలు మంజునాథరెడ్డి, మునేగౌడు, బాలు, నాగరాజు, రమేష్, ఎంపిడిఒ ప్రేమ్‌రాజ్‌కుమార్, కల్పన, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రామకుప్పం మండలం పంద్యాలమడుగు, బైపరెడ్లపల్లి, ఆనిగానూరు, రాజుపేట పంచాయతీల్లో జరిగిన కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి ప్రసంగించారు. కార్యక్రమాల్లో ఎంపిడిఒ ఈశ్వరన్, నేతలు రామూర్తి, కృష్ణనాయక్, గంట్లప్ప గౌడు, చంద్రశేఖర్‌రెడ్డి, జయశంకర్, విశ్వనాథ్, శ్రీనివాసులు గౌడు, మహేంద్రనాయుడు, కృష్ణారెడ్డి, రామలింగం, షణ్ముగం, శంకరాచలం, అధికారులు పాల్గొన్నారు.

## తిరుచ్చి వాహనంపై దేవేరులతో కల్యాణ వెంకన్న



చంద్రగిరి, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:
శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం దేవదేవుడైన శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి వారు తన దేవేరులు శ్రీదేవి భూదేవి సమేతుడై తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత స్వామివారి ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాద్, సూపరింటెండెంట్ తేనెపల్లి వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు కేనమాకుల పల్లి రాజు, అధ్యాపక రవిచంద్రన్, ఘనాపాటి తిరువేంగడం, జమేధార్ జలంధర్, సిబ్బంది పాల్గొన్నారు.

## పచ్చదనం పెంపొందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది
### కమిషనర్ ఎన్. మౌర్య

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త



పచ్చదనం పెంపొందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కమిషనర్ ఎన్. మౌర్య పేర్కొన్నారు. శనివారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం సీతమ్మ నగర్ మాస్టర్ ప్లాన్ రోడ్ లో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా సంఘాల మహిళలతో కలిసి కమిషనర్ మౌర్య మొక్కలు నాటారు. కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా 15 రోజుల పాటు గాంధీ జయంతి వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే మొక్కలు నాటడం, పరిసరాలు పరిశుభ్రం చేయడం, వేస్ట్ టు వండర్ ఆర్ట్, పలు ప్రాంతాల్లో పెయింటింగ్ వేయించడం కొన్ని కార్యమాలు నిర్వహిస్తున్నామన్నారు. మొక్కలు నాటడమే కాదని వాటిని పరిరక్షించడం కూడా మన బాధ్యతగా తీసుకోవాలన్నారు. పరిశుభ్రత అంటే మన ఇల్లు మాత్రమే శుభ్రం చేసుకోవడం కాదని, పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవడం అన్నారు. ఇటీవల హెల్త్ ఆఫీసర్, తమ సిబ్బందితో కలిసి నగరంలో పాస్టిక్ రెడ్స్ నిర్వహించామని, పెద్ద ఎత్తున నిషేధిక ప్లాస్టిక్ వస్తువులు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. దుకాణారులకు 30 రోజులు గడువు ఇచ్చామని, ఇకపై ప్లాస్టిక్ విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించామని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు.

## భీములవారిపాలెం రేవు వద్ద స్వచ్ఛసాగర్ కార్యక్రమం
### - పాల్గొన్న తిరుపతి జిల్లా డిఎఫ్ఓ



తడ, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త
తిరుపతి జిల్లాలో తీరప్రాంతం కలిసిన తర్వాత పులికాట్ సరస్సు ఒడ్డున కొన్ని కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా శనివారం తడ మండలం భీములవారిపాలెం పడవల రేవు వద్ద అధికారులు, పులికాట్ జాలర్లు, నాయకులు కలిసి స్వచ్ఛ సాగర్, సురక్షిత సాగర్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో తిరుపతి డిఎఫ్ఓ ఎ.నాగరాజు పాల్గొని సరస్సు తీరాన స్వచ్ఛత ప్రమాణాలు పాటిస్తే ఎంతో మేలవుతుందని చెప్పారు. భీములవారిపాలెం రేవు ఆంధ్రా, తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న కారణంగా పలు కుప్పాల జాలర్లు ఇక్కడి నుంచి వేటకు వెళ్లి తిరిగి వస్తారు. ముఖ్యంగా సరస్సు మధ్యలోని ఇరకం దీవికి ఇదే ప్రధాన పడవ దారి. దీనితో అధికారులు ఈ గ్రామాన్ని ఎంచుకొని సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి బొమ్మన్ శ్రీధర్, బివి పాలెం ఎంపిటిసి రమేష్, మత్స్యకార సంక్షేమ సమితి నాయకులు బి.ధనంజయ, బీట్ ఇన్‌ఛార్జ్ సెల్వి సుధాకర్, ఇరకం దీవికి చెందిన శేఖర్, వినోద్, వేణుగోపాల్, నందయ్య, అధికారులు పోలయ్య, నరసింహారావు, విఘ్నేష్, నరేంద్రబాబు, ఎంఇఒ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సిఎంను కలిసిన జనసేన నేత మునిగిరిష్



గూడూరు, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త
రాష్ట్ర డిప్యూటీ సిఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌ను పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ విభాగం అధ్యక్షుడు వేములపాటి అజయ్ కుమార్ సారధ్యంతో గూడూరు జనసేన పార్టీ నాయకులు మునిగిరీష్ మర్యాద పూర్వకంగా కలిశారు. జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం మంగళగిరిలో కలుసుకున్న గూడూరు జనసేన నాయకులు మునిగిరిష్ మెగాస్టార్ చిరంజీవి కుటుంబం పట్ల అభిమానంతో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని పవన్ కుమార్‌కు గుర్తు చేశారు. గతంలో చిరంజీవి యువత ద్వారా చేపట్టిన సేవా కార్యక్రమాలు, ప్రజారాజ్యం పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించి యువరాజ్యం విభాగంలో జిల్లా కార్యదర్శిగా పని చేసిన విషయాలను పవన్‌తో పంచుకున్నారు. ఈ సందర్భంగా నా సేన నా వంతులో భాగంగా జనసేన పార్టీకి తన తరపున రూ 2 లక్షలు విరాళంగా అందజేయడం జరిగిందని తెలిపారు.

## వేంకటేశ్వరునికి పూలంగి సేవ



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త
పెరటాశి నెల మొదటి శనివారాన్ని పురస్కరించుకొని సూళ్లూరుపేటలోని శ్రీమద్వేంకట రామ్మూర్తి ఆలయంలో వేంకటేశ్వరస్వామికి పూలంగి సేవ చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. స్వామివారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు. ఆలయ అర్చకులు వినుకొండ అనంతకుమార్ దీక్షితులు ఆధ్వర్యంలో వంశపారంపర్య ధర్మకర్త బీరక రాంబాబు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి. అలాగే శ్రీహరికోట బస్టాండు వద్ద గల ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, పందరి భజనలు నిర్వహించారు.

## మంచి ప్రభుత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్దాం : ఎమ్మెల్యే పాశం



వాకాడు, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త
రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్దామని అధికారులకు గూడూరు శాసన సభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ సూచించారు. శనివారం వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం గ్రామంలోని ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అధికారులు సత్వరమే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రామయ్య, ఎంపిడివో మనోహర్ గౌడ్, ఇరిగేషన్ ఈఈ, టిడిపి మండల కన్వీనర్ మధు రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, నాయకులు సన్నారెడ్డి విజయ శేఖర్ రెడ్డి, ఏవో దీప, పిఆర్ఏఈ కిరణ్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సురేష్, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, మండల బిజెపి అధ్యక్షుడు మల్లీ ప్రసాద్, జనసేన మండల అధ్యక్షులు రౌతు శివకోటి, మాజీ జడ్పిటిసి సభ్యురాలు ప్రమీల, కోట శ్రీనివాసులు, అన్నమేట్ చంద్రయ్య, నెల్లూరు సుధాకర్, దువ్వూరు రమణారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా చంద్రబాబు పాలన
### మ్మెల్యే డాక్టర్ థామస్




పాలసముద్రం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:
రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా సిఎం చంద్రబాబునాయుడు పాలన సాగిస్తూ ముందుకు వెళ్తున్నారని జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. పాలసముద్రం ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో శనివారం ఎంపిడిఓ రామనాథరెడ్డి ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడుతూ చదువుకున్న యువత ముందుకు వచ్చి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. గ్రామాల అభివృద్ధికి యువత నడుంబిగించి కలసికట్టుగా పని చేయాలన్నారు. మాజీ డిప్యూటీ సిఎం నారాయణస్వామికి పిచ్చికుక్క కరవడంతో పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని, కూటమి ప్రభుత్వం చెప్పిన సూపర్ సిక్స్ అమలు చేయడం లేదని ప్రచారం చేస్తున్నారన్నారు. తిరుమల ప్రసాదంలో కల్తీ లేదని ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. తాను పలువురి వద్ద డబ్బులు తీసుకుంటున్నానని, ఇసుక అక్రమార్కులకు అండగా నిలిచానని చెప్పడం హాస్యాస్పదంగా వుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్, ఎస్ఎస్ఎ ఎపిసి వెంకటరమణారెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ చంద్రసురేష్, సర్కిల్ ఇన్స్‌పెక్టర్ హనుమంతప్ప, ఎస్ఐ భారతి, తహసిల్దారు అరుణకుమారి, ఎంఇఓ రాజేంద్రప్రసాద్, ట్రాన్స్‌కో ఎఇ వరదరాజులు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మోహన్‌కృష్ణ, సిహెచ్ఓ జ్ఞానశేఖర్, ఎఓ విద్యావతి, ఇఓఆర్డీ రమేష్‌బాబు, ఎపిఓ మార్గరేట్, తెలుగుదేశం పార్టీ నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఓలు, సర్పంచ్‌లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు తగు సహకారం - అలీప్ సంస్థ ప్రతినిధులు



కుప్పం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త
కుప్పం ప్రాంతంలో ఉన్న ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు తగు సహకారం అందిస్తామని హైదరాబాద్ అలీఫ్ ఎంటర్ప్రూనర్ సంస్థ ప్రతినిధులు జ్యోతిరాణి, అజయ్‌బాబు పేర్కొన్నారు. శనివారం కుప్పం మండల కార్యాలయంలో కడ అధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి తగు ప్రణాళికలు, యంత్రాల కొనుగోలు, మార్కెటింగ్ సౌకర్యం తదితరాలపై అవగాహన కల్పించడంతో పాటు హైదరాబాదులో ఉన్న ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో తగు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించి తర్ఫీదు ఇవ్వడం జరుగుతుందన్నారు. పారిశ్రామికవేత్తలు ప్రారంభించాలనుకునే పరిశ్రమలకు సంబంధించి ప్రభుత్వాల నుంచి తగు సహకారం అందేలా చూస్తామన్నారు.

# వెలుగులో అవినీతి చీకట్లు-సహకరించని విఓ లీడర్లు, సభ్యులు

### -రూ.1.83కోట్లు నగదు స్వాహాలో..
### -తలలు పట్టుకుంటున్న విచారణాధికారులు

తొట్టంబేడు, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త
వెలుగు సంస్థలో పనిచేస్తున్న సిబ్బందిని నమ్మి సొమ్మును జమచేసిన సంఘ సభ్యులు లబోదిబోమంటున్నారు. తమ సొమ్ముకు భద్రత ఉంటుందని భావించిన అమాయకులకు వేదనే మిగిలింది. ఇద్దరు సంఘమిత్రలు రూ.1.83కోట్లు దిగమింగి ఇంటిదారి పట్టగా కాయకష్టం చేసి పైసా పైసా మిగలబెట్టుకున్న లబ్దిదారులు లబోదిబోమంటున్నారు. కోట్లు స్వాహాచేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో వివరాల్లోకి వెళితే మండలంలోని చియ్యవరం గ్రామంలో ఇద్దరు సంఘమిత్రలు ఉన్నాయి. వీరిలో ఒకరు మునిలక్ష్మి, మరొకరు మునిశేఖర్, సిసిగా రేవతి విధులు నిర్వహిస్తున్నారు. గ్రామంలో మొత్తం 56 గ్రూపులు ఉండగా 700మంది సభ్యులు ఉన్నారు. మహిళలు ఆర్థికస్వావలంభన సాధించాలన్న దిశగా ప్రభుత్వం వెలుగు సంస్థను ఏర్పాటు చేసి మహిళా గ్రూపులుగా ఏర్పాటుచేసి ఒక్కొక్క గ్రూపులో 10 నుంచి 12మంది మహిళలు వరకు ఉంటారు. వీరికి ప్రభుత్వం నుంచి ఒక్కొక్క గ్రూపుకు నిధులు మంజూరు చేస్తుంది. ఈనిధులను గ్రూపు సభ్యులు సమానంగా పంచుకోవడంతో పాటు బ్యాంకుకు సకాలంలో చెల్లించాల్సిన అవసరం ఉంది. ఇలా మండలంలో 1052 మహిళా సంఘాల ఉండగా 10496మంది సభ్యులు ఉన్నారు. చియ్యవరం గ్రామంలో ఉన్న సంఘమిత్రలు తమ చేతివాటాన్ని ప్రదర్శించి ప్రజల నమ్మకాన్ని దెబ్బతీశారు. తాము తీసుకున్న నగదును బ్యాంకులో చెల్లిస్తారన్న నమ్మకంతో సంఘమిత్రలకు నగదు చెల్లించారు. అయితే వీరు చెల్లించకపోవడంతో పరిశీలించిన వెలుగు ఎపిఎం గురుమూర్తి ప్రశ్నించగా అసలు విషయం బయటపడింది. ఈనెల 15వతేదీన నగదు చెల్లిస్తామని చెప్పడంతో ఎపిఎం, అధికారులు గ్రామానికి చేరుకుని నగదు చెల్లించాలని మహిళా సంఘసభ్యులను కోరగా వారు తాము సంఘమిత్రలకు చెల్లించామని చెప్పడంతో ఎపిఎం, అధికారులు అవాక్కయ్యారు. అంతేకాకుండా సిసి రేవతి కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఈ తతంగం అంతా సాగుతోందని తెలిసిపోయింది. గత మూడు రోజుల నుంచి దీనిపై విచారణకు వచ్చిన ప్రత్యేక బృందంకు చియ్యవరం పంచాయతీలో ఉన్న విఓ లీడర్లు,సభ్యులు సహకరించకపోవడంతో విచారణాధికారులు తలలు పట్టుకుంటున్నారు. అయితే పత్రికల్లో వార్తలు వస్తున్నా జిల్లా ఉన్నతాధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంలో అంతర్యమేమిటో అర్థం కావడం లేదు. పాత్రికేయులు గ్రామానికి వెళ్లి విచారించగా అవినీతి జరిగిందని తమను సంఘమిత్రలు మోసం చేశారని చెప్పిన విఓ లీడర్లు, సభ్యులు అధికారులు ప్రశ్నించినపుడు మాత్రం ఎందుకు సమాధానం చెప్పలేదు..వారు విచారణ జరిపి సంతకాలు పెట్టమన్న కాగితాలను ఎందుకు చించివేశారని విచారణాధికారులు తలలు పట్టుకుంటున్నారు.



వెలుగు కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్‌ఫోటో)